విశాలాంధ్ర
విశాఖపట్నం
సోమవారం 4, ఆగస్టు 2025

జేవీఎస్ఎన్‌కు ఎస్టీయూ అభినందన

విశాలాంధ్ర - విశాఖ సిటీ: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకుకు చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన జేవీ సత్యనారాయణమూర్తిని రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘం నాయకులు పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఎంతో ప్రగతి పథంలో నడుస్తున్న బ్యాంకును మరింత ముందుకు నడపాలని ఆకాంక్షించారు. ఒకవైపు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ మరోవైపు బ్యాంకు చైర్మన్‌గా సేవలందించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. జేవీ సత్యనారాయణ మూర్తిని కలిసిన వారిలో జిల్లా అధ్యక్ష ప్రధాన బాధ్యులు ఇమంది పైడిరాజు, సీహెచ్.స్వామి, అనకాపల్లి జిల్లా ఎస్టీయూ నాయకులు రామిరెడ్డి ఉన్నారు.

నేడు ఏఎంసీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

పెద్ద ఎత్తున తరలిరావాలని డా. సందీప్ పిలుపు

విశాలాంధ్ర - ఆనందపురం: భీమిలి నియోజకవర్గం భీమిలి వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు జరగనున్న జనసేన పార్టీ నాయకులు భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురిమిన రామస్వామి నాయుడు ప్రమాణస్వీకారానికి కూటమి నేతలు పెద్దఎత్తున తరలి రావాలని భీమిలి ఇన్‌చార్జ్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి డైరెక్టర్ డాక్టర్ సందీప్ పంచకర్ల పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పలువురు శాసనసభ్యులు హాజరవుతున్న సందర్భంగా ఉదయం 9 గంటలకు తగరపువలస నుండి భారీ ర్యాలీతో సభా ప్రాంగణానికి చేరుకొని ప్రమాణ స్వీకార మహోత్సవంలో చైర్మన్‌తోపాటు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారాన్ని జయప్రదం చేయాలని సందీప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం మార్కెట్ యార్డ్ సభ ప్రాంగణాన్ని చైర్మన్ రామస్వామి, సందీప్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీనుబాబు, దివాకర్, కోరుకొండ మూర్తి, బాలు, గోవింద్, నాయుడు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధించే ఉత్తర్వులపై
ఏఐఎస్ఎఫ్ ఆగ్రహం

ప్రజాస్వామ్య విరుద్ధమని నిరసన
ఉత్తర్వులను చించేసిన నాయకులు

విశాలాంధ్ర - విశాఖ: పాఠశాలల్లో విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆదివారం ఏఐఎస్ఎఫ్ ఆందోళన నిర్వహించింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పి.శేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. వారికి సకాలంలో పాఠ్య పుస్తకాలు, నాణ్యమైన పౌష్టికాహారం, విద్యార్థుల నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, ఎటువంటి షరతులు లేకుండా పూర్తిస్థాయిలో తల్లికి వందనం అమలు చేయాలని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, వారి హక్కుల కోసం పోరాటం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులను అనుమతించబోమని చెప్పడాన్ని ఖండించారు. ఇది విద్యార్థి హక్కులు, వారి స్వేచ్ఛను అణిచివేయడంలో భాగమేనని అన్నారు. ఇది విద్యార్థుల అభివృద్ధికి పూర్తిగా విరుద్ధమని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఏడాదిలోనే భయం మొదలైందని, అందుకే ఇటువంటి నియంతృత్వ ఉత్తర్వులు జారీ చేస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో తమ హక్కులకు భంగం కలిగే సందర్భంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉందని చెప్పారు. కానీ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులపై పోలీసులను అడ్డుపెట్టుకొని కేసులు పెడతామని బెదిరించడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. ఎన్ని కేసులు పెట్టినా విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నప్పుడు వారికి ఏఐఎస్ఎఫ్ అండగా ఉంటుందని తెలిపారు. తక్షణమే లోకేష్ స్పందించి ఈ ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉత్తర్వులను దగ్ధం చేసే ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకోవడంతో చింపి వేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి హేమానంద్, జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి అభిషేక్, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నేడు పిజిఆర్ఎస్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం - పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కార్యక్రమం జరుగుతుందని, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. అర్జిదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు.

విలువైన ప్రభుత్వ భూములను కాపాడండి

భూ ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయాలి: సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర - గాజువాక: కూర్మన్నపాలెం సర్వే నెంబర్ 27లో కోట్లు విలువ చేసిన 5.48 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుంటే రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని సీపీఐ గాజువాక కార్యదర్శి కెంగువ అచ్యుత్‌రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.వనజాక్షి విమర్శించారు. ఆదివారం కూర్మన్నపాలెంలో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా కెంగువ అచ్యుత్‌రావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎంతో విలువైన ప్రభుత్వ భూములు, గెడ్డలు, వాగులు ఆక్రమణకు గురవుతుంటే రెవెన్యూ అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారని అన్నారు. కూర్మన్నపాలెంలో కోటల్లో విలువైన ప్రభుత్వ భూమిని కబ్జాదారులు ఆక్రమణ చేస్తుంటే వారిపై కేసులు పెట్టకుండా మొక్కుబడిగా ఒక షెడ్డు కూల్చివేయడం ఏమిటని ప్రశ్నించారు. మిగిలిన రేకుల షెడ్లను కూడా డిస్మెంటల్ చేసి ప్రభుత్వ భూమిని రక్షించాలని లేనిపక్షంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించి ఆర్డీఓ, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. తక్షణమే భూ ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ముర్రుపాలతోని చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం

కేజీహెచ్ సూపరింటెండెంట్ ఐ.వాణి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ముర్రుపాలు పాలతో అప్పుడే పుట్టిన చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని కేజీహెచ్ సూపరింటెండెంట్ ఐ.వాణి అన్నారు. ఈమేరకు తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా ఐసిడిఎస్, ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఆర్‌కె బీచ్ కాళీమాత ఆలయం వద్ద పెద్ద ఎత్తున అంగన్వాడీలు ప్లకార్డులతో "తల్లిపాలు ముద్దు - డబ్బాపాలు వద్దు" అనే నినాదంతో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు ఇవ్వడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కెవి రామలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతమని, వీటిలో అనేక పోషకాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సీడీపీఓలు కె.నీలిమ, డి. నీల వేణి, ఎం.శ్రీదేవి, ఝాన్సీ రాణి, సంతోషి, శ్రీలత, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నయనానందంగా ఆర్జిత సేవలు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి ఆలయంలో వేదపండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా స్వర్ణ పుష్పార్చన, నిత్య కళ్యాణం నయనానందంగా జరిగాయి. ఇన్‌చార్జ్ కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు, ప్రధాన అర్చకులు

శ్రీనివాసాచార్యులు ఆదేశాల మేరకు పర్యవేక్షణాధికారి వాసు పర్యవేక్షణలో అర్చక స్వాములు వేకువ జామున స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజ స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కళ్యాణ మండపంలో వేదికపై అధీష్టింపజేసి వేద మంత్రాలు నాధ స్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామి వారి స్వర్ణ పుష్పార్చన, నిత్య కళ్యాణం, గరుడ సేవ ఆర్జిత సేవలు కమనీయంగా జరిగాయి. మంత్రపుష్పం, మంగళా శాసనాలు తర్వాత భక్తులకు వేదాశీర్వచనం, శేష వస్త్రాలు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రక్తదానం ఎందరికో పునర్జన్మ

హోమి బాబా క్యాన్సర్ ఆసుపత్రి డాక్టర్ చారుమతి

విశాలాంధ్ర - అగనంపూడి: రక్తదానం మరెందరికో పునర్జన్మ ప్రసాదించినట్లేనని హోమి బాబా క్యాన్సర్ ఆసుపత్రి డాక్టర్ చారుమతి అన్నారు. ఉచిత శిబిరాల్లో దాతలు ఎక్కువగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అగనంపూడి బ్లూ ఎవిన్ అభిరామ్ అపార్ట్మెంట్స్ కాన్ఫరెన్స్ హాల్లో శ్రీ సత్యసాయి శత దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని శ్రీ సత్య సాయి భజన మండలి జెసిఐ అభిరామ్ అపార్ట్మెంట్స్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా స్థానిక టాటా హోమి బాబా క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం ప్రారంభించారు. ముందుగా సత్య సాయికి పూలమాల వేసి ప్రార్థన చేసి అభిరామ్ అపార్ట్మెంట్స్ డిస్టెన్స్ వెల్ఫేర్ అసోయేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎన్ రావు జ్యోతి ప్రజ్వలన చేశారు. హోమి బాబా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చారుమాతి మాట్లాడుతూ క్యాన్సర్ ఆసుపత్రి రోగులకు అత్యవసర పరిస్థితుల్లో కావలసిన రక్తాన్ని సత్యసాయి ఆర్గనైజేషన్, జెసిఐ వారు అందజేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జెసిఐ ప్రతినిధి రమ్య, ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, అగనంపూడి వాకర్స్ క్లబ్ అధ్యక్షులు మదుగుల నర్సింగరావు, సత్య సాయి ప్రతినిధులు జి.రామకృష్ణ, ఆర్‌ఏ నాయుడు, కెవి రమణ, ఎల్.వెంకటరమణ, జెసిఐ ప్రతినిధులు ఎస్.రవికుమార్, వెంకట కిరణ్ పాల్గొన్నారు. సుమారు 62 మంది రక్తదానం చేశారు.

కూటమి మోసాలను ప్రజలకు వివరించాలి

వైసీపీ భీమిలి సమన్వయకర్త చిన్న శ్రీను

విశాలాంధ్ర - పద్మనాభం: ఎన్నికల్లో అమలుకాని హామీలు ఇచ్చి మోసం చేస్తున్న కూటమి వైఫల్యాలను ప్రజలకు వివరించాలని వైసీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మద్ది గ్రామంలో జరిగిన బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమాయక ప్రజలకు నెరవేర్చని హామీలతో మోసం చేస్తూ కూటమి అధికారంలోకి వచ్చిందని, ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అనే పేరుతో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని అన్నారు. ఇప్పటివరకు ఒక్క రేషన్ కార్డు కూడా పేద ప్రజలకు ఇప్పించ లేకపోయిందని, బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ ఇస్తానని హామీ ఇచ్చిందని, దానిని పట్టించుకోలేదని, నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి ఇప్పటివరకు ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా, అదే నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చేంత వరకు కూడా నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చి నిరుద్యోగులను నట్టేట ముంచిందని అన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ పేరుతో ప్రతి రైతుకు 20,000 ఇస్తానని చెప్పి ఒక ఏడాది పూర్తిగా ఇవ్వకుండా చేతులెత్తేసిందని తెలియజేశారు. పరిపాలన చేయడం చేతకాక అవకాశం దొరికిన కాడికి అప్పులు చేస్తూ అమరావతి పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ రాంబాబు, జడ్పీ వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు, నియోజవర్గంలోని ముఖ్య నాయకులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రైయిన్లలో పూడికతీత పనులు వేగవంతం చేయాలి

భీమిలి ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర - పీఎం పాలెం: మధురవాడ, కొమ్మాది ప్రాంతాల్లో జాతీయ రహదారి పక్కన డ్రెయిన్లలో మురుగు శుభ్రం చేసే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. ఆదివారం కాలువల్లో పూడికతీత పనుల ప్రగతిని పరిశీలిం చారు. డ్రెయిన్లు పూర్తిగా వ్యర్థ పదార్థాలతో నిండిపోవడం వల్ల పరిసర ప్రాంతాలు తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నాయి. స్థానిక కార్పొరేటర్ పిల్లా మంగమ్మ, ఆమె భర్త వెంకట్రావు డ్రెయిన్లు పూర్తిగా మురుగుతో నిండిపోయాయని కర్రతో శుభ్రం చేసే ప్రయత్నం చేశారు. జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రధాన డ్రెయిన్లలో అనేక ఏళ్లుగా పూడిక తీయక పోవడంతో మురుగు మేటలుగా పేరుకుపోయింది. వర్షం వచ్చినప్పుడు డ్రెయిన్‌లో మురుగుతో కలిసి రహదారిపై పొంగి పొర్లుతోంది. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి రావడంతో పూడికతీతకు రూ.75 లక్షలు మంజూరు చేయించారు. అయితే నిత్యం విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఉండడంతో మురుగు తీసే పనులు వేగంగా జరగడం లేదు. జేసీబీ, ప్రొక్లెయిన్‌లతో మురుగు తీయాలన్నా ట్రాఫిక్ జామ్ అయిపోతుందని మాన్యువల్‌గా శుభ్రం చేస్తున్నారు. దీంతో గంటా శ్రీనివాసరావు 7వ వార్డు పరిధిలో జరుగుతున్న డ్రెయిన్‌లను చూశారు. జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మితో ఫోన్‌లో మాట్లాడారు. పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌ను, అధికారులను సోమవారం సమావేశపరచాలని చెప్పారు. నిర్దేశిత గడువులోగా మురుగు తొలగించాలని పేర్కొన్నారు.

ఫిరాయింపు కార్పొరేటర్ల ఓటింగ్ హక్కును రద్దు చేయాలి

డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: మేయర్ అవిశ్వాస ఓటింగ్‌లో పాల్గొన్న 27 మంది వైసీపీ ఫిరాయింపు కార్పొరేటర్ల హక్కును రద్దు చేయాలని డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ డిమాండ్ చేశారు. ఆదివారం మద్దిలపాలెంలో వైసీపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జి.వి.ఎం.సి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్‌రావు మాట్లాడారు. పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లపై అనర్హత వేటు పెండింగ్‌లో ఉండగా స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ఎలా నిర్వహించగలరని ప్రశ్నించారు. ఫిరాయింపుదారుల అనర్హత అంశం ప్రస్తుతం హైకోర్టులో ఉందని, ఇప్పటికే వారి పేర్లకు సంబంధించి కలెక్టర్ నోటీసులు పంపించారని తెలిపారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లకు ఓటు హక్కు కల్పించడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. వారి ఓటు హక్కును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పార్టీ తరపున నామినేషన్ దాఖలు చేసిన కార్పొరేటర్లు నక్కిల లక్ష్మి, సాది పద్మారెడ్డి, పల్లా అప్పలకొండ, బిపిన్ కుమార్ జైన్, కోడిగుడ్ల పూర్ణిమ, రేయి వెంకట రమణ కె.వి.శశికళ, గుండాపు నాగేశ్వరరావు ,మహమ్మద్ ఇమ్రాన్, ఉరుకూటి రామచంద్రరావు (చందు) తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతపై ప్రచారం

విశాలాంధ్ర - పద్మనాభం: ఆగస్టు 16 తేదీన రాబోయే శ్రీ కృష్ణ జన్మాష్టమి పండుగ సందర్భంగా త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక విజయరాంపురం కమిటీ ఆధ్వర్యంలో పద్మనాభం మండలంలోని కోరాడ, సుంకర పేట గ్రామాల్లో కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవానుడికి మాత్రమే ఊరేగింపు చేయాలని, దేవుడే అవతరించి ఒక మనిషిగా జన్మిస్తే ఆయనను భగవంతుడు అని అంటామన్నారు. అలాంటి భగవంతుడే శ్రీకృష్ణుడు అని, ఆయనను మాత్రమే అందరూ దైవంగా గుర్తించాలన్నారు. పూర్వం శ్రీ కృష్ణాష్టమి 11 రోజుల పాటు చేసేవారని, చివరిగా చవితి రోజున ఊరేగింపు చేసి ముగించేవారని ప్రబోధ సేవా సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు, సభ్యులు కే.త్రినాధరావు, శ్యామ్, సంతోష్, రాజు, లక్ష్మి, బంగారు తల్లి, మంగమ్మలు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి నియోజకవర్గంలో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న నలుగురికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాసంలో యువ నాయకుడు గంటా రవితేజ ఆదివారం రూ. 4.67 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. భీమునిపట్నం మండలం అన్నవరం గ్రామానికి చెందిన మేరుగు అనన్యకు 1.85 లక్షలు, జీవీఎంసీ 1వ వార్డు తగరపువలస బంగ్లా మెట్టకు చెందిన వెంపాడు అరవింద్ కుమార్‌కు 1.68 లక్షలు, ఆనందపురం మండలం గంభీరం గ్రామానికి చెందిన పిల్లా సూరిబాబుకు రూ.70 వేలు, వేము లవలస గ్రామానికి చెందిన బోనెల ఈశ్వరరావుకు రూ.43 వేల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ ఆర్థికంగా కష్టాల్లో ఉన్న వారికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్య క్రమంలో ఆనందపురం మండల పార్టీ అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, వేములవలస గ్రామ పార్టీ అధ్యక్షుడు బంగారు నాయుడు, గంభీరం సర్పంచ్ వానపల్లి ఈశ్వరరావు, గరే సదానంద, అన్నవరం గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతం స్నేహం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: కుల, మతాలకు అతీతమే స్నేహమని, స్నేహమే శాశ్వతమని, స్నేహానికి మించింది మరేది లేదని ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంఘం అభిప్రాయపడింది. ఫ్రెండ్ షిప్ డే వేడుకలను ఆదివారం సంఘం ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉక్కు జనరల్ మేనేజర్ ఎస్.వీరేశం, సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకటేశ్వర్లు, కోశాధికారి ఎస్.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

పినగాడి - వేపగుంట రోడ్డు కోసం పంచకర్ల అలుపెరుగని పోరాటం

వీఎమ్మార్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

విశాలాంధ్ర - పెందుర్తి: పినగాడి - వేపగుంట రోడ్డు నిర్మాణం కోసం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అలుపెరుగని పోరాటం చేశారని వీఎమ్మార్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ కే.ఎస్.విశ్వనాథన్ స్పష్టం చేశారు. వీఎమ్మార్డీఏ మాస్టర్ ప్లాన్‌లో 12.8 కోట్లతో పినగాడి వేపగుంట రోడ్డు, 30.8 కోట్లతో దువ్వాడ రైల్వే స్టేషన్ లంకెలపాలెం అనకపల్లి రోడ్డు, 24.5 కోట్లతో గొల్లలపాలెం అమృత పురం లింకు రోడ్డు నిర్మాణాలకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, వీఎమ్మార్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్ ఆదివారం ఉదయం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అలాగే జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలో వీఎమ్మార్డీఏ నిధులు 8.23 కోట్లతో నిర్మించిన ఏసీ కన్వెన్షన్ హాల్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీఎమ్మార్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ పినగాడి వేపగుంట రోడ్డును ఎమ్మెల్యే రమేష్ బాబు ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిధులు మంజూరు చేయించారని వెల్లడించారు. అలాగే నియోజకవర్గంలో అనేక రోడ్ల నిర్మాణాలకు నిధులు

సాధించుకుని, తాను ప్రజల కోసం పనిచేసే మనిషిగా నిరూపించుకున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రమేష్ బాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పినగాడి వేపగుంట రోడ్డు నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తానని స్పష్టం చేశారు. వైసీపీ నాయకులు అసంబద్ధ విమర్శలు చేసి ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని విమర్శించారు. కమిషనర్ విశ్వనాథన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రమేష్ బాబు ఎప్పుడు కలిసినా పినగాడి రోడ్డు కోసమే అడిగే వారిని ఆ రోడ్డు నిర్మాణాన్ని ఆయన ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని వెల్లడించారు. తాను కమిషనర్‌గా చార్జ్ తీసుకున్న రెండో రోజునే ఈ ఫైల్‌ను ఆమోదించినట్లు తెలిపారు. కాగా సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉండిపోయిన పినగాడి వేపగుంట రోడ్డు శంకుస్థాపన పనుల కోసం జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు భారీ ఏర్పాట్లు చేశారు. సింహాచలం దరి గోశాల నుండి వీఎమ్మార్డీఏ కన్వెన్షన్ హాల్ వరకు వందలాది మంది కార్యకర్తలు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి అతిథులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వీఎమ్మార్డీఏ ఇంజనీరింగ్ అధికారులు, జీవీఎంసీ జోనల్ కమిషనర్ హైమావతి, 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, 97వ వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంత శంకర్రావు, 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా, బీజేపీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రాము నాయుడు, పీఏసీఎస్ చైర్మన్ అయితి సింహాచలం, సుధాకర్ రాజు, కరణం కనకరాజు, వార్డు అధ్యక్షులు కంచిపాటి మధు, దాట్ల మధు, విన్నింటి పార్వతి, గంటల దివాకర్, డిబిఎల్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు కొరుపోలు రామనాయుడు, కరక దేముడు, కర్రీ కనకరాజు, వియ్యపు చిన్న, సీనియర్ నాయకులు జామి గంగు నాయుడు, మంతా నాగ సుధా, రాపర్తి కిషోర్, గొల్లవిల్లి రమణ, బైలపూడి హరి గోపాల్, గొర్లె అప్పారావు, ఆర్ఎస్ నాయుడు పాల్గొన్నారు.

వీఎమ్మార్డీఏ అధికారుల తీరుపై

కార్పొరేటర్ ముమ్మన ఆగ్రహం

విశాలాంధ్ర - పెందుర్తి: వీఎమ్మార్డీఏ అధికారులు తీరుపై జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు సహా పలువురు మహిళలు, బిజెపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లెలో వీఎమ్మార్డీఏ నిధులతో నిర్మించిన కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవం, పలు రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, వీఎమ్మార్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్ ఆదివారం శంకుస్థాపన చేశారు. అయితే ఆయా పనుల వద్ద ఏర్పాటుచేసిన శిలాఫలకాలపై స్థానిక కార్పొరేటర్‌గా తన పేరు లేకపోవడం పట్ల ముమ్మన దేముడు సంబంధిత అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ పట్టించుకోరా అంటూ నిలదీశారు. తాను కూడా కూటమిలోనే ఉన్నానని అయినా ఇలాంటి నిర్లక్ష్యం సరి కాదని ఆవేదన వెలిబుచ్చారు. కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవం గురించి కూడా తనకు సరిగా సమాచారం ఇవ్వలేదని విమర్శించారు.

దీనిపై వీఎమ్మార్డీఏ కమిషనర్, చైర్మన్‌లను కలిసి మాట్లాడుతానని, శిలాఫలకాలు మార్చి కొత్తవి ఏర్పాటు చేయాలని కోరుతానని ముమ్మన దేముడు స్పష్టం చేశారు. మరోవైపు ముమ్మన దేముడుకు మద్దతుగా పలువురు మహిళలు కూడా వీఎమ్మార్డీఏ అధికారులు తీరుపై మండిపడ్డారు. కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి పునాది వేసింది ముమ్మన దేముడేనని, అలాంటి వ్యక్తిని అవమానించడం దారుణమని విమర్శించారు. ఉన్నతాధికారులు స్పందించి తప్పును సరిదిద్ది కొత్త శిలాఫలకాలు ఏర్పాటు చేయాలని మహిళలు డిమాండ్ చేశారు. మరోవైపు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు కూడా శిలాఫలకాలపై స్థానిక కార్పొరేటర్ పేరు లేకపోవడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం.

రైతులకు బియ్యం సహాయం బాధాకరం

మిషన్ కర్షక దేవోభవ జాతీయ అధ్యక్షుడు ఆడారి కిషోర్ కుమార్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: దేశంలో రైతులు ఉత్పత్తి చేసే ప్రతి పంటకు కనీస మద్దతు ధర ప్రకటించి వారిని ప్రోత్సహించినప్పుడే రైతులకు వ్యవసాయం గిట్టుబాటు అవుతుందని, అనేకమంది రైతులు వ్యవసాయం చేయడానికి ముందుకు వస్తారని మిషన్ కర్షక దేవోభవ జాతీయ అధ్యక్షుడు ఆడారి కిషోర్ కుమార్ అన్నారు. విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గంలోని పద్మనాభం మండలం మద్ది గ్రామంలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా కిషోర్ కుమార్ రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి అన్నం పెడుతున్న రైతులు గిట్టుబాటు ధర లేక వ్యవసాయం వదిలేసి కూలీలుగా మారుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో కొంతమంది రైతు మిత్రులకు వారి నిత్యావసరాలకు బియ్యాన్ని సహాయంగా అందించారు. దేశానికి అన్నం పెట్టే రైతులకు బియ్యాన్ని సహాయంగా అందించాల్సిరావడం బాధాకరంగా ఉందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో వ్యవసాయం చేసే ప్రతి రైతుకు, రైతు ఉత్పత్తి చేసే ప్రతి పంటకు ప్రోత్సాహకాలు కనీస మద్దతు ధర వంటివి ప్రకటించి వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో కర్షక దేవోభవ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మలబార్‌లో ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువలరీ షో ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖపట్నం: ప్రముఖ ఆభరణాల సంస్థ మలబార్ గోల్డ్, డైమండ్స్ విశాఖ స్టోర్‌లో ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువలరీ షోను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ స్టోర్ హెడ్ జరీన్ మాట్లాడుతూ "ఆర్టిస్ట్రీ షో" బ్రాండెడ్ జ్యువలరీ ఒక విశిష్ట ఆభరణాల ప్రదర్శన అన్నారు. ఈ ప్రదర్శనలో భాగంగా బంగారం, వజ్రాభరణాలు, జాతి రత్నాభరణాలను ప్రదర్శి స్తుందన్నారు. ఈ ఆభరణాలు అద్వితీయమైన కళా నైపుణ్యంతో అంతులేని హుందాతనంతో కూడినవని, నగిషీ చెక్కిన ప్రతి ఆభరణం తయారు చేసిన వారి అనుభవం ఇంకా కళాత్మకతకి నిదర్శనంగా నిలుస్తూ, ఈ షో యొక్క సందేశం ఆర్ట్ ఇన్ ఎవరీ జువెల్‌ని బలపరుస్తాయన్నారు. ఆర్టిస్ట్రీ షోలో ప్రత్యేక ఆకర్షణలుగా మలబార్ గోల్డ్, డైమండ్స్ వారి బ్రాండుల సమాహారం "మైన్" ధ్రువీకరించిన వజ్రాభరణాలు, వివాహం, పార్టీ సంబరాల కోసం, "ఎరా" అన్కట్ వజ్రాలతో పొదిగిన విశిష్ట శ్రేణి, "ప్రెష్యా" జాతిరత్నాభరణాల సముదాయం, "ఎత్నిక్స్" హస్తకళా నైపుణ్యతతో తయారైన ఆభరణాలు, "జోల్" అధునాతన డిజైన్లతో తేలికపాటి ఆభరణాలు, "డివైన్" భారతీయ ప్రాచీన సంప్రదాయం వ్యక్తం చేసే ఆభరణాలు, ఇంకా చిన్నారుల కోసం "స్టార్లెట్" పిల్లల ఆభరణాలు అందుబాటులో ఉంచామన్నారు. ఈ ప్రదర్శన మలబార్ గోల్డ్, డైమండ్స్‌లో ఆగస్టు పదో తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ "ఆర్టిస్ట్రీ షో" సందర్భంగా ప్రతి కొనుగోలుపై ప్రత్యేక ఆఫర్లను ఉన్నాయని, బంగారు ఆభరణాల, రత్నాభరణాల తరుగు చార్జీలపై ఫ్లాట్ 30 శాతం తగ్గింపు, వజ్రాభరణాల వజ్రాల విలువపై 30 శాతం వరకు తగ్గింపు పొందవచ్చు అని చెప్పారు.

పాఠశాలల ప్రాంగణ నిషిద్ధత ఉత్తర్వులపై పునఃసమీక్ష జరపండి

ప్రభుత్వానికి చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం లేఖ

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: రాష్ట్రంలోని పాఠశాలల ప్రాంగణాల్లో అనధికార వ్యక్తుల ప్రవేశాలు నిషేధిస్తూ ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టరేట్ ఆర్సీ నంబర్. 30/67/2025-ఎ, ఐ ఉత్తర్వులు జారీ చేయడం బాలల హక్కుల పరిరక్షణ ఉల్లంఘనలుగా భావిస్తున్నామని చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి, న్యాయ సలహాదారు కె.ప్రవీణలు తెలిపారు. ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో వారు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులను, స్కూల్ మేనేజ్మెంట్ ప్రతినిధులను, ముందస్తు ప్రభుత్వ అనుమతులు పొందిన వ్యక్తులు, సంస్థలను మాత్రమే అనుమతిస్తూ తీసుకున్న ప్రభుత్వ నిర్ణయం, అలాగే రాజకీయ పార్టీల సంస్థలకు చెందినవారిని నిరాకరించడం హర్షణీయమని అన్నారు. కానీ ఈ ఉత్తర్వుల్లో బాలల హక్కుల సంఘాలు, వారి సంక్షేమాన్ని, ఆరోగ్య పరిరక్షణకు, హక్కులను కాంక్షించి నిత్యం ఎన్నో అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేసే ప్రభుత్వ ద్రవ్య సహాయంతో, సహాయం లేని ఇతర ప్రభుత్వేతర(ఎన్జీఓ) సంస్థల ప్రవేశంపై స్పష్టమైన సమాచారం లేకపో వడం బాలల హక్కుల ఉల్లంఘనగా భావించాల్సి ఉందని అన్నారు. నిత్యం ఎన్నో సమస్యలతో నెట్టుకొస్తున్న విద్యార్థుల కష్టనష్టాలు పూర్తి స్థాయిలో సంబంధిత శాఖ ఉన్నతాధికారుల దృష్టికి చేరాలంటే రాష్ట్రంలో ముందస్తు అనుమతులు కల్గిన రిజిస్టర్డ్ బాలల హక్కుల సంఘాలను అనుమతించాలని కోరారు.

బాలల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న వారితోనే ఇది సాధ్యమవడంతోపాటు రాష్ట్రంలోని కోట్లాదిమంది విద్యార్థులకు శతశాతం హక్కుల పరిరక్షణకు ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకొని ఈ ఉత్తర్వులపై పునః సమీక్షలు జరిపేలా జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు, రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌కు లేఖలు సమర్పించామని అన్నారు. బాలలకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఉత్సాహంగా హెరిటేజ్ ఫెస్ట్ 2025 సాంస్కృతిక కార్నివాల్

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలోని గంభీరం ఐఐఎం రోడ్డులో ఉన్న హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో శ్రీ రాధా మధన్ మోహన్ మందిరంలో హెరిటేజ్ ఫెస్ట్ - 2025 సాంస్కృతిక కార్నివాల్ వేడుకలు ఘనంగా ప్రారంభించారు. ఈ ఫెస్ట్ 11వ తేదీ వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. వివిధ రంగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించి విజేతకు చివరి రోజున బహుమతులు అందజేయడం జరుగుతుందని గంభీరం హరేకృష్ణ వైకుంఠం అధ్యక్షుడు అంబరీష దాస తెలిపారు. 2న చిత్రలేఖనం పోటీలు, 4న పౌరాణిక వేషధారణ, భగవద్గీత శ్లోక పఠనం, 5న భగవద్గీత శ్లోక పఠనం, 6న గాత్ర సంగీతం, 7న నాటకములు, 9న శాస్త్రీయ నృత్యం 11న కుండలపై పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్ వర్క్ వంటి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన బాలబాలికలు 9985364430, 8790160232 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు. శనివారం జరిగిన చిత్రలేఖనం పోటీల్లో వివిద పాఠశాలల నుండి సుమారు 600 మంది బాలబాలికలు పాల్గొన్నారు. చిన్నారులు వేసిన వివిధ రకాల బొమ్మలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

ఏకలవ్య ఫౌండేషన్ సభ్యుడిగా రాము నాయుడు

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి కైట్స్ స్కిల్ డెవలప్మెంట్ విద్యా సంస్థ అధినేత గొర్లె రామునాయుడు ఏకలవ్య ఫౌండేషన్ సభ్యత్వం స్వీకరించారు. పెందుర్తి కైట్స్ స్కిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ నందు ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని 30 గ్రామాలలో జరుగుతున్న విద్యా వికాస కేంద్రాలు నిర్వాహకులకు ఆదివారం ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. అలాగే మరో మూడు ఏకలవ్య ఫౌండేషన్ ట్యూషన్ సెంటర్స్ ప్రారంభించారు. వేపగుంట బీసీ కాలనీ ప్రాంతంలో అప్పన్నపాలెం ప్రాంతంలో నూతన కేంద్రాలు ప్రారంభించగా, ఈ కార్యక్రమానికి కైట్స్ అధినేత గొర్లె రామునాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని శేషమాంబ పాల్గొని మాట్లాడుతూ కేంద్రాలు నెలకొల్పుడం ఆనందదాయకంగా ఉందని విద్యతోపాటు, సంస్కారం, సాంప్రదాయాలకు పెద్దపీట వేయాలని చదువులో ముందుండి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు వారి జీవితంలో ఉపయోగపడే అంశాలను బోధించాలని కేంద్ర నిర్వాహకులకు సూచించారు. ప్రాజెక్ట్ మేనేజర్ ప్రశాంత్ నిర్వాహకులకు ట్రైనింగ్ ఎలా ఇవ్వాలి అనే దానిపై తర్ఫీదు ఇచ్చి, నిర్వాహకులు నుండి ఫీడ్బ్యాక్ తీసుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రశాంత్, జిల్లా కోఆర్డినేటర్ వనజ, జిల్లా కోఆర్డినేటర్ గౌరీ నాయుడు, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

స్కూటర్ టెక్నీషియన్‌లకు ప్రభుత్వ సహకారం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: వాహనాలు సమర్థవంతంగా నడవడానికి మెకానిక్‌లు డాక్టర్లు వంటి వారని, వారికి ప్రభుత్వ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. స్మార్ట్ సిటీ వైజాగ్ స్కూటర్, బైక్ టెక్నీషియన్ వెల్ఫేర్ సొసైటీ 10వ వార్షికోత్సవం సందర్భంగా జనసేన పార్టీ విశాఖపట్నం అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ముడసర్లోవ పార్కులో ఏర్పాటు చేసిన వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ మనిషి ఆరోగ్యానికి డాక్టర్ ఎంత కీలకపాత్ర వహిస్తారో, వాహనాలు సమర్థవంతంగా ఉండడానికి మెకానిక్‌లు డాక్టర్లు వంటి వారని అన్నారు. ప్రభుత్వం ద్వారా ఎటువంటి సహకారం కావాలన్నా తమ వంతు తోడ్పాటు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లపై జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర- విశాఖపట్నం: వర్షాకాలంలో మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లు పెరగడానికి వలు కారణాలు ఉన్నాయని తగు జాగ్రత్తలు తీసుకోవాలని లయన్స్ క్యాన్సర్, జనరల్ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వి. ఉమామహేశ్వరరావు తెలిపారు. మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లు మూత్ర వ్యవస్థను ప్రభావితం చేసే సాధారణ ఇన్ఫెక్షన్లు, ఇందులో మూత్రపిండాలు, మూత్రాశయం, మూత్ర నాళాలు ఉన్నాయని, మహిళలు ముఖ్యంగా మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లకు గురవుతారన్నారు. వర్షాకాలంలో ఈ సమస్య పెరుగుతుందని, వర్షాకాలం దానితో పాటు వాతావరణంలో ఉత్తేజకరమైన మార్పును తెస్తుందని, కానీ ఇది మహిళల్లో మూత్ర నాళాల ఇన్ఫెక్షన్ల పెరుగుదలతో సహా అనేక ఆరోగ్య సమస్యలను కూడా తెస్తుందన్నారు. పెరిగిన తేమ, తడి, వ్యక్తిగత పరిశుభ్రత పద్ధతుల్లో మార్పులు వంటి అనేక అంశాలు ఈ పెరుగుదలకు దోహదం చేస్తాయన్నారు. పబ్లిక్ టాయిలెట్ వాడకం తరచుగా పెరుగుతుందని, బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ కారణాలుగా చెప్పారు. సరైన పరిశుభ్రతను పాటించాలని, యు టి ఐ లను నివారించడంలో మంచి వ్యక్తిగత పరిశుభ్రత చాలా కీలకం అన్నారు. ప్రతిరోజూ నీరు, తేలికపాటి సబ్బుతో మీ జననేంద్రియ ప్రాంతాన్ని కడుక్కోవాలని అన్నారు. మంచి టాయిలెట్ పరిశుభ్రతను పాటించండి అని సూచించారు.

స్వచ్ఛ సర్వేక్షన్‌లో ఆదర్శంగా వాకర్స్ క్లబ్

విశాలాంధ్ర - గాజువాక: స్వచ్ఛ సర్వేక్షన్‌లో అగనంపూడి వాకర్స్ క్లబ్ ఆదర్శవంతంగా పనులు చేపడుతోంది. జీవీఎంసీ 79వ వార్డ్ పరిధి అగనంపూడి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రౌండ్‌లో ఉన్న ప్లాస్టిక్ బ్యాగులు గాజు పింకులు, చెత్త లను బ్యాగులు పట్టుకొని వాకర్స్ పరిశు భ్రత కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం 79వ వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ ఎం.కోటేశ్వరరావు 6వ జోన్ శానిటరీ ఇన్స్పెక్టర్లకు సూపర్వైజర్‌గా ప్రమోషన్ పొందిన సందర్భంగా ఆయనకు, అలాగే అగనంపూడి వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి ఎంతో సహకరించిన రావి చలపతిరావు ఇటీవల ఉక్కు ఉద్యోగ విరమణ చేయడం వల్ల ఆయనకు ఘనంగా సత్కరించారు.

బిఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బలిరెడ్డి నాగేశ్వరరావు, 85 వార్డు జనసేన పార్టీ అధ్యక్షులు గవర సోమశేఖర్ మాట్లాడుతూ పరిశుభ్రమనేది నిత్యజీవితంలో ఒక భాగమని అగనంపూడి 79, 85 వార్డులకు అనుసంధానంగా యువకులు మహిళలు పిల్లలు శరీర వ్యాయామం చేయడానికి అగనంపూడి వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేయడంలో స్థానిక వాకర్స్ క్లబ్ కమిటీ ఎంతో కృషి చేస్తుందని అన్నారు.

ఈ వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి మా వంతు సహకారం అందిస్తామని అన్నారు. అగనంపూడి వాకర్స్ క్లబ్ అధ్యక్షులు మడగల నర్సింగరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, కె.వి.నాయుడు, గంధం బాబురావు, బోలో శంకర్రావు, సురేష్, నూకరాజు, బి.రామారావు, కరణం పైడిరాజు, చిన్ని పూర్ణ, ఆది నాయుడు, బోయిన హరిబాబు, మరిశా నాగేశ్వరరావు, 79వ వార్డు తెలుగు మహిళ అధ్యక్షురాలు గల్లా అనిత, సిహెచ్ మంగవేణి వాకర్స్ పాల్గొన్నారు.

పెద్దిపాలెంలో "బాబు షూరిటీ మోసం గ్యారంటీ"

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో పెద్దిపాలెం గ్రామంలో ఆదివారం సాయంత్రం వైఎస్సార్సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు నేతృత్వంలో "బాబు షూరిటీ మోసం గ్యారంటీ" కార్యక్రమం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు గ్రామీణ ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. గత 14 నెలలుగా కుటమీ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని, సూపర్ సిక్స్ పేరుతో ప్రకటించిన పథకాలు అమలు కాలేదన్నారు. కొత్త పింఛన్లను మంజూరు చేయలేదని, ప్రజలకు ఇవ్వాల్సిన హామీలన్నీ నెరవేరకపోవడం వల్ల వారిలో అసంతృప్తి పెరిగిందని పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన పెంచే ఉద్దేశ్యంతో కరపత్రాలు పంపిణీ చేస్తూ, వైఎస్సార్సీపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి నిజాలను తెలియజేస్తున్నారని అన్నారు. సంపద సృష్టి పేరుతో రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచుతున్నారని ఆరోపించారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ వైఎస్సార్సీపీ ప్రజల పక్షాన నిలుస్తుందని, అధికార సంబంధం లేకుండానే ప్రజాసంకల్ప యాత్రలా పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కోరాడ వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షులు బంక సత్యం, వైఎస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్ రెడ్డి శ్రీనివాసరావు, వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, వైస్ ఎంపీపీ పాండ్రంగి శ్రీను, బొట్ట రామకృష్ణ, మాజీ కోపరేట్ సొసైటీ అధ్యక్షులు మరు పిల్ల రామస్వామి, మరుపల్లి చిన్నయ్య పాత్రుడు, చిన్న రామారావు సర్పంచ్ భావిశెట్టి భారతమ్మ, రాజు, శంకర్, శనగం దామోదర్, అప్పలరాజు, పాండ్రంకి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.